క్లుప్తంగా

ఘనంగా 'సుంకు పండుగ'



సామూహిక భోజనాలు చేస్తున్న గిరిజనులు

ములకలపల్లి: ఆదివాసీల వార్షిక తొలి వేడుక 'సుంకు పండుగ'ను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ప్రతీ యేడాది తొలకరి ఆరంభంలో ఈపండుగను ఘనంగా నిర్వహిస్తారు. తాళ్లపాయ జీపీలోని బూర్గుకొయ్య గుంపు గ్రామస్తులు కలసి కట్టుగా కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత సాంప్రదాయ పూజలు చేశారు. ఏరువాక సాగారు. దుక్కులు దున్నారు. అనంతరం గ్రామశివారులో సామూహికంగా వంటలు వండి, తాటి పాతికల్లో భోజనాలు చేశారు. జూన్ మాసంలో మరళా భూమిపండుగ చేస్తారు. అటుపిమ్మట విత్తనాలు చల్లడం, సేద్యం చేయడం ఆరంభిస్తారు.

పాలిసెట్‌కు సర్వం సిద్ధం

భద్రాచలంటౌన్: భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాల అటానమస్‌లో ఈ నెల 13న జరిగే పాలిసెట్ పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్, కోఆర్డినేటర్ డాక్టర్ కె.జాన్ మిల్టన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కళాశాలలో ఏర్పాటు చేసిన రెండు సెంటర్లలో 719 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారని పేర్కొన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1-30 వరకు పరీక్ష ఉంటుందని, అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు ఒక గంట ముందుగానే చేరుకోవాలని సూచించారు. ఒక్క నిమిషం నిబంధన అమలులో ఉండడంతో ఉదయం 10 గంటల నుంచి సెంటర్‌లోకి అనుమతి ఇస్తామని వెల్లడించారు. పరీక్ష కేంద్రంలోకి క్యాలిక్యులేటర్, వాచ్, మొబైల్స్, పర్సులు, షూస్, ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించేది లేదని, హాల్ టికెట్‌పై ఫోటోలు స్పష్టంగా లేని అభ్యర్థులు గెజిటెడ్ ఆఫీసర్ ద్వారా తమ ఫోటోలను ధ్రువీకరించుకోవాలని ఆయన తెలిపారు.

పేద ప్రజలకు అండగా ఎర్రజెండా

మణుగూరురూరల్: పేద ప్రజలకు ఎల్లవేళలా అండగా ఉండేది ఎర్రజెండానే అని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి.అయోధ్య తెలిపారు. ఆదివారం సమితిసింగారం గ్రామపంచాయతీలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మణుగూరు అభివృద్ధిలో సీపీఐ పోషించిన పాత్ర మరువలేనిదన్నారు. కమ్యూనిస్ట్ పార్టీని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీ కార్యకర్తపై ఉందన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు దుర్గ్యాల సుధాకర్, వేర్పుల నరేష్, మంగి వీరయ్య, సర్వర్, ఎస్ కుటుంబరావు, ఎడారి రమేష్, రుద్ర నాగరాజు, సమ్మక్క, నిర్మల, సత్యనారాయణ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ వెంకటేశ్వరరావు

మణుగూరురూరల్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పక పాటించాలని మణుగూరు ఇన్‌చార్జ్ సీఐ వెంకటేశ్వరరావు సూచించారు. ఆదివారం మండలంలోని హనుమాన్ టెంపుల్ సమీపంలో అర్బన్ పార్క్ వద్ద సీఐ వెంకటేశ్వరరావు సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వాహనదారులకు ట్రాఫిక్ నియమ నిబంధనలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ సారయ్య, టిజిఎస్‌పి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మంత్రుల ఆశీర్వాదం

దమ్మపేట: నూతన దంపతులను రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి ఆశీర్వదించారు. మండల కేంద్రం, దమ్మపేట గ్రామంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, రాష్ట్ర నీటి పారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయబాబుతో కలసి ఆదివారం దమ్మపేట గ్రామానికి చెందిన సొసైటీ డైరెక్టర్ చిన్నశెట్టి సత్యనారాయణ కుమారుడి వివాహ వేడుకలకు హాజరయ్యారు. నూతన దంపతులను దీవించారు. కాంగ్రెస్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

బూర్గంపాడు: లక్ష్మీపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు పోతిరెడ్డి కోటిరెడ్డి, ఇందిర దంపతుల కుమార్తె షర్మిలరెడ్డి, కొడుకు జగన్‌మోహన్‌రెడ్డిలను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి సీతక్క, ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆశీర్వాదించారు. చిన్నారుల వోణి, పంచెకట్టు వేడుకకు ఆదివారం మంత్రి, ఎమ్మెల్యే హాజరై వారిని ఆశీర్వాదించారు.ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పైసలిస్తేనే ధాన్యం లోడింగ్?

- పూనుగూడెం కొనుగోలు కేంద్రంలో క్వింటాకు 5 కిలోల వరకు తరుగు
- ఆ మేరకు రూ.115 నుంచి 173 వరకు నగదు వసూలు?



పూనుగూడెం కేంద్రంలో లోడింగ్‌కు సిద్ధంగా ఉన్న ధాన్యం

ములకలపల్లి: ఆరుగాలం శ్రమించి పండించిన పంట అమ్మేందుకు అన్నదాత నానాతంటాలు పడుతున్నారు. తేమశాతం, తూర్పార సాకు చూపుతూ.. క్వింటాకు 5 కిలోల వరకూ తరుగు తీస్తున్నారు. ఇదిలా ఉండగా, ఐదు కిలోలకు రూ.115 నుంచి 173 వరకూ నగదు చెల్లించాలంటూ అనధికారిక రూల్ అమలు చేస్తున్నారు. అలా ఇస్తేనే ధాన్యం లోడింగ్‌కు ఏర్పాటు చేస్తామని హుకుం జారీ చేస్తుండంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు.

ములకలపల్లి మండల వ్యాప్తంగా ధాన్యం కొనుగోలుకు 9 కేంద్రాలు (పీపీసీ)లు ఏర్పాటు చేయగా, వీటిలో 7 సెంటర్లు స్థానిక పీఏసీఎస్ ద్వారా, మరో రెండు జీసీసీ ద్వారా నిర్వహిస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ఏప్రియల్ 16న చాపరాలపల్లిలో అధికారికంగా కొనుగోలు కేంద్రాన్ని ఆరంభించారు. ఇప్పటి వరకూ సొసైటీ ద్వారా 47లారీలు మిల్లులకు తరలించగా, ఒక్క పూనుగూడెం సెంటర్ నుండే 15 లారీల ధాన్యం తరలించడం గమనార్హం. ఇక జీసీసీ కేంద్రాల నుంచి ఒక్కలారీ కూడా లోడు కాలేదు.

అధిక మొత్తంలో వసూళ్లు

ధాన్యంలో తేమ, తూర్పార సాగుతో గతంలో ఒకటి, అరా కిలోల ధాన్యం తరుగు తీయడం పరిపాటిగా మారింది. ఐతే పూనుగూడెం కేంద్రంలో ఈసారి సరికొత్త పద్దతి ఆరంభించిట్లు అత్యంత విశ్వసనీయంగా తెలిసింది. క్వింటాకు ఐదు కిలోల పేరిట కిలోకు రూ.23 నుండి రూ.50 వరకూ నగదు వసూలు చేస్తున్నారు. అంటే క్వింటా ధాన్యం అమ్మాలంటే రూ.115 నుండి రూ.173 వరకూ కలెక్ట్ చేస్తున్నట్లు సమాచారం. దీనికితోటు హమాలీ చార్జీ రూ.60 మొత్తం కలిపి 200 నుండి 250 వరకూ దర్జాగా దోచుకుంటున్నట్లు పుకార్లు షికార్లు చేస్తున్నాయి. డబ్బు ముందుగా చెల్లిస్తేనే లోడింగ్ లారీలు ఏర్పాటు చేస్తామని అనధికారిక ఆదేశాలు జారీ చేస్తున్నారు. ఎలాగోలా పెట్టుబడి పెట్టి పండించిన పంట ఆఖరి దశలో అమ్మే తరుణాన మళ్లీ పెట్టుబడి ఎలా తీసుకురావాలో తెలియక అన్నదాత తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈవిషయాన్ని పేరుతెలపడం ఇష్టంలేని పలువురు రైతులు తమ గోడు వెల్లబోసుకున్నారు.

దళారులకు దోచిపెట్టేలా..

తేమశాతం, తూర్పార పట్టడం, అకాల వర్షాలు తదితర అననుకూలపరిస్థితులను చూపుతూ, స్థానిక కొనుగోలు బాధ్యులే దళారులను ప్రోత్సహిస్తున్నట్లు తెలుస్తోంది. మండలవ్యాప్తంగా అన్ని కేంద్రాల్లోనూ ఆదే పరిస్థితి నెలకొని ఉంది. పీపీసీల్లో క్వింటాకు రూ.2,300 వస్తుండగా, గత్యంతరం లేని పరిస్థితుల్లో రూ.1,800 నుంచి 1,950 వరకూ దళారులకు విక్రయిస్తున్నారు. అధికారిక పీపీసీల్లోకి ప్రయివేటు వాహనాలు వచ్చి, లోడింగ్ చేయడమే స్థానిన సిబ్బంది సహకారాన్ని తేలతెల్లం చేస్తున్నాయి.

నిబంధనల మేరకే..



ప్రభుత్వ నియమ నిబంధనల మేరకే ధాన్యం కొనుగోలు చేస్తున్నాం. 17 శాతం తేమ,తూర్పారపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. నగదు వసూలు వంటివి అసత్య ఆరోపణలు.

-కె.శ్రీనివాసరావు, పీఏసీఎస్ సీఈఓ, ములకలపల్లి

దృష్టి సారిస్తాం..



తరుగు అంశం, డబ్బులు వసూలు చేస్తున్న విషయం మా దృష్టికి రాలేదు. ఈ విషయంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతాం. రైతుల సంక్షేమమే మా లక్ష్యం.

– అరుణ్‌బాబు, మండల వ్యవసాయాధికారి

కల్యాణలక్ష్మి చెక్కుల అందజేత



దమ్మపేట: కల్యాణలక్ష్మి చెక్కు లబ్ధిదారురాలికి అందజేస్తున్న ఎమ్మెల్యే జారె, తహసీల్దార్ వాణి



మణుగూరురూరల్: చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

దమ్మపేట: కాంగ్రెస్ పార్టీతోనే ప్రజా సంక్షేమ పాలన సాధ్యమని స్థానిక ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పేర్కొన్నారు. మండలంలోని గండుగులపల్లి క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్యే జారె ఆదినారాయణ 28 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులు అందజేశారు. పట్వారిగూడెం గ్రామంలో బిగ్ టీవీ సౌజన్యంతో ఎల్.వీ.ఆర్ హాస్పిటల్, సత్తుపల్లి వారిచే నిర్వహించబడిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. శిబిరంలో ఎమ్మెల్యేకు పలు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వాసం రాణి, ఇన్‌చార్జ్ తహసీల్దార్ కె.వాణి, ఆర్ఐ వీరాస్వామి, మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు..

మణుగూరురూరల్: మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎనిమిది లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి నుండి మంజూరైన రూ3.50లక్షల విలువ గల చెక్కులను ఆదివారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పీరినాకి నవీన్, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు తరుణ్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎప్‌సెట్ ఫలితాల్లో ర్యాంకులు



సాకేత్

అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ): ప్రభుత్వం శుక్రవారం ప్రకటించిన ఎప్‌సెట్ ఫలితాల్లో మండల కేంద్రం అన్నపురెడ్డిపల్లికి చెందిన విద్యార్థి టి.సాకేత్ రాష్ట్రస్థాయిలో 1562 ర్యాంకు సాధించాడు. అన్నపురెడ్డిపల్లిలోని మహాత్మా జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ జూనియర్ కళాశాలలో సాకేత్ ఇంటర్‌మీడియట్ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. ర్యాంకు సాధించడం పట్ల బీసీ గురుకులాల కార్యదర్శి బి.సైదులు, ఉమ్మడి జిల్లా ఆర్సీఓ సీహెచ్ రాంబాబు, డీసీఓ బ్యూలారాణి, కళాశాల ప్రిన్స్‌పాల్ ఎస్‌కె.బురాన్‌లు సాకేత్‌ను అభినందించారు.


లిటిల్ ఫ్లవర్స్ విద్యార్థులు..



విజయకేతనం చూపుతున్న లిటిల్ ఫ్లవర్స్ విద్యార్థులు, అధ్యాపకులు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని లిటిల్ ఫ్లవర్స్ విద్యాసంస్థల విద్యార్థులు ఆదివారం విడుదలైన ఎప్‌సెట్ ఫలితాలలో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించిన్నట్లు విద్యాసంస్థల డైరెక్టర్లు మాగంటి రమేష్ బాబు, శ్రీనివాస వర ప్రసాద్ బాబులు ఓ ప్రకటనలో వెల్లడించారు. ఎంపీసీ విభాగంలో గుడుమసు జ్యోత్స్న ప్రియ 5955, మొహమ్మద్ సన తబస్సుమ్ 7283, దాట్ల దివ్య దర్శిని 10067, కవురు జాహ్నవి 12976, బాజీ మోక్షిత 14998, తలబత్తుల ఎస్ఎస్‌హెచ్ వంశీధర్ 15908 ర్యాంకులు సాధించారు. అలాగే బైపీసీ విభాగంలో ఒంటెద్దు గ్లోరీ 8994, కుంజా సాయి పూజిత 12673, దాసరి స్రావిక 17611 ర్యాంకులతో మెరిశారు. ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థిని విద్యార్థులను లిటిల్ ఫ్లవర్స్ విద్యా సంస్థల ఆవరణలో మెమెంటోలతో సత్కరించారు. ఫలితాలకు సహకరించిన అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు బషీర్ తో పాటు కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

డంపింగ్ యార్డ్ తరలించాలి



గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌ను అడ్డుకున్న సీపీఎం నాయకులు, స్థానికులు

భద్రాచలంఅర్బన్: రామాలయానికి కూతవేటు దూరంలో కరకట్టపై పోస్తున్న చెత్త డంపింగ్‌ను పట్టణ శివారుకు తరలించాలని, ప్రజల ప్రాణాలతో చలగాటమాడుతున్న గ్రామపంచాయతీ అధికారులు నిర్లక్ష్యం వీడాలని సీపీఎం ఆధ్వర్యంలో ముదిరాజ్ బజారు, చప్తా దిగువ, రామాలయం పరిసర ప్రాంతాల ప్రజలు ఆదివారం ఆందోళన చేపట్టారు. కరకట్ట పైకి చెత్తను తరలిస్తున్న పంచాయతీ వాహనాలను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎంబి నర్సారెడ్డిలు మాట్లాతూ.. పట్టణంలో సేకరించిన చెత్తను కరకట్టపై పోసి తగలబెట్టడంతో పొగ కమ్ముకుని రామాలయం వైపు, కాలనీ వైపు పొగ వ్యాప్తిస్తోందని, రామాలయం వచ్చే భక్తులతో పాటుగా పరిసర ప్రాంతాల్లో నివాసం ఉంటున్న కాలనీ ప్రజలు తీవ్ర అస్వస్థలకు గురవుతున్నారని అన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బండారు శరత్ బాబు, పట్టణ కమిటీ సభ్యులు చుక్కా మాధవ రావు, శాఖ కార్యదర్శి ధనలక్ష్మి, స్థానికులు సీత, హైమావతి పాల్గొన్నారు.

నేడు అప్రెంటీస్ మేళా

మణుగూరుటౌన్: మండలంలోని ముత్యాలమ్మనగర్ గ్రామపంచాయతీలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో నేడు సోమవారం ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటీస్ మేళా నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ జి.రవి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ అప్రెంటీస్ మేళాకు హైదాబాద్‌కు చెందిన ప్రముఖ కంపెనీల ప్రతినిధులు హాజరుకానున్నారన్నారు. జిల్లా పరిధిలో ఐటీఐ పూర్తి చేసుకున్న యువతీయువకులు పాల్గొనాలని కోరారు. ఐటీఐ పూర్తి చేసి అప్రెంటీస్ శిక్షణ పొందిన వారితో పాటు పొందని వారు సైతం ఈ అవకావాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ములకలపల్లి: ములకలపల్లి జీపీ పరిధిలో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్-కో ఏఈ నరేశ్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

'రాజీవ్ యువవికాసం'కు 1,984 దరఖాస్తులు

అశ్వారావుపేటరూరల్: రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతి, యువకుల కోసం ప్రవేశ పెట్టిన రాజీవ్ యువ వికాసం పథకానికి విశేష స్పందన లభించిందని స్థానిక ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం మాట్లాడుతూ..ఈ పథకం కింద ఏడు కార్పొరేషన్లకు సంబంధించి మొత్తం 1984 మంది నిరుద్యోగులు దరఖాస్తులు చేశారని చెప్పారు. తుది జాబితాను ఈ నెల 20వ తేదీన సిద్ధం చేసి, అదే రోజు ఉన్నతాధికారులకు సమర్పిస్తామని వెల్లడించారు.

ఆలయంలో పూజలు

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని వినాయకపురం గ్రామం వద్దగల చిలకలగండి ముత్యాలమ్మ తల్లి ఆలయంలో ఆదివారం భక్తులు పూజలు చేశారు. ఉదయం నుంచి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలిరాగా, అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. అనంతరం ఆలయం వద్ద అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు.

20న దేశవ్యాప్త సమ్మె

భద్రాచలంఅర్బన్: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక ఉద్యోగ విధానాలను నిరసిస్తూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20వ తేదీ జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏజే రమేష్ కోరారు. సీఐటీయూ పట్టణ కమిటీ సమావేశం ఎస్ అజయ్ కుమార్ అధ్యక్షతన ఆదివారం స్థానిక బండారు చందర్‌రావు భవన్‌లో జరిగింది. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్లకు లాభం చేస్తూ కార్మిక ఉద్యోగులను దెబ్బతీస్తోందని, ఇటువంటి నిర్ణయాలకు వ్యతిరేకంగా 20వ తేదీ జరిగే దేశవ్యాప్త సమ్మెలో ఉద్యోగులు, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని రమేష్ పిలుపునిచ్చారు. సమావేశంలో సంఘం పట్టణ కన్వీనర్ బండారు శరత్ బాబు, సీనియర్ నాయకులు ఎంబీ నర్సారెడ్డి , తదితరులు నాయకులు పాల్గొన్నారు.

ఇళ్ల కేటాయింపుల్లో అక్రమాలు

ఎమ్మెల్యే, అనుచరులపై సొంత పార్టీ నాయకుల విమర్శ



సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

దుమ్ముగూడెం: మండలంలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుల్లో అక్రమాలు చోటుచేసుకున్నాయని, కేవలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అనుచరులు చెప్పినట్లుగా అధికారులు జాబితా రూపొందిస్తున్నారని మండల కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. ఆదివారం మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు విరమాచినేని వినీల్ అధ్యక్షతన ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. నిజమైన అర్హులకు ఇళ్లు రాకపోవడంతో బాధితులు తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారని అన్నారు. కొందరు నాయకులు తమ స్వప్రయోజనాల కోసం వీరిచే జాబితాలు తయారు చేస్తున్నారని, స్థానిక కాంగ్రెస్ ఎమ్మెల్యే సమక్షంలో జరుగుతున్నాయన్న విషయం మరింత కలవరపరిచే అంశం అన్నారు. అలాగే మండలంలో పర్యటించిన రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యటన వివరాలు సైతం కాంగ్రెస్ నాయకులకు సమాచారం ఇవ్వకపోవడం వేనుక అంతర్యం ఏంటని ప్రశ్నించారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు తెల్లం హరికృష్ణ, సీనియర్ నాయకులు బైరెడ్డి సీతారామరావు, శిరపు అప్పల రెడ్డి, జిల్లా మీడియా -కమ్యూనికేషన్ చైర్మన్ కను బుద్ది దేవ, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సిద్ది ప్రవీణ్, ఉపాధ్యక్షుడు గంట్ల ప్రశాంతి, కారం నవీన్, బుర్రి లావణ్య,యువజన నాయకులు డింగి సందీప్ రెడ్డి , గంట్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్‌ఆర్‌తోనే కేటాయింపులు సాధ్యం



వర్గీయులతో మాట్లాడుతున్న జలగం వెంకట్రావు

దమ్మపేట: గత కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో అడిగిన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు కేటాయించడం అనేది, అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వైఎస్ రాజశేఖర్ రెడ్డితోనే సాధ్యమైందని మాజీ ఎమ్మెల్యే జలగం వెంకట్రావు అన్నారు. ఆదివారం దమ్మపేట గ్రామానికి చెందిన సొసైటీ డైరెక్టర్ చిన్నశెట్టి సత్యనారాయణ కుమారుడి వివాహ వేడుకకు జలగం హాజరుకాగా.. అక్కడ పాతతరం అభిమానులు, నాయకులతో కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. గతంలో సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యేగా జలగం పనిచేసిన సమయంలో అడిగిన ప్రతి ఒక్కరికీ, కాదనకుండా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేశారనే విషయాన్ని గుర్తు చేశారు. దీనికి స్పందించిన జలగం.. అదంతా రాజశేఖర్ రెడ్డి దయవల్లే జరిగిందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు చెలికాని సూరిబాబు, శ్రీరాముల ప్రసాద్, చిన్నశెట్టి యుగంధర్, జలగం వాసు, కోటగిరి రామకృష్ణ, చీకటి మురళి, రామకృష్ణ, చారి తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన మాటను నెరవేరుస్తాం..



భద్రాచలంఅర్బన్: మాట్లాడుతున్న ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్

భద్రాచలంఅర్బన్: ఎన్నికల హామీల్లో భాగంగా ఆర్యవైశ్యులకు ఇచ్చిన మాటకు వంద శాతం నెరవేరుస్తానని, సంఘం శాశ్వత భవనానికి అతి త్వరలోనే శంకుస్థాపన కార్యక్రమం చేపడుతామని ఆర్య వైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు దారా రమేష్ అన్నారు. ఆదివారం స్థానిక అన్నమయ్య రెసిడెన్సీలో ఆర్యవైశ్య మహాసభ భద్రాచలం నియోజకవర్గం చైర్మన్ కురిచేటి శ్రీనివాస్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. సంఘం శాశ్వత భవన నిర్మాణానికి పొలిటికల్ చైర్మన్ కొడుమూరి కోటేశ్వరరావు సొంత స్థలం వితరణ చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా సెక్రటరీ ఝెలుగూరి నగేష్, పొలిటికల్ జిల్లా చైర్మన్ కొడుమూరి కోటేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్లు ఉడత రమేష్, పసుమర్తి శ్రీనివాస్, తల్లాడ ఉపేందర్, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మణుగూరురూరల్: నిరుపేదల ఆర్యవైశ్యులకు ప్రభుత్వ సహకారం అందేలా కృషి చేస్తున్నామని ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు ధారా రమేష్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని అశోక్‌నగర్‌లో జరిగిన సమావేశానికి ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఆర్యవైశ్యుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని, జిల్లాలో మూడు వేల సభ్యత్వాలే లక్ష్యమని అన్నారు. అనంతరం ధారా రమేష్, కొడుమూరి కోటేశ్వరరావు, ఏలుగురు నగేష్‌లను ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కడివెండి విశ్వనాథ గుప్తా, జిల్లా కార్యదర్శి ఝెలుగూరి నగేష్, మహిళా జిల్లా అధ్యక్షురాలు చిత్తలూరి ఉమా, ఉపాధ్యక్షులు ధారా ధీరజ్, ఉడత రమేష్, పసుమర్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం ఎన్నిక



అధ్యక్ష, కార్యదర్శులు పాషా, రామరవి

భద్రాచలంటౌన్: జిల్లా నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం ఎన్నిక భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో ఆదివారం జరిగింది. తెలంగాణ కేంద్ర నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం కార్యదర్శి గంగాధర్ సమక్షంలో జరిగిన ఈ ఎన్నికలో అధ్యక్షుడిగా ఎస్‌కె.పాషా, కార్యదర్శిగా అజ్మీర్ రామరవిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే ఉపాధ్యాక్షుడిగా వెంకటేశ్వర్లు, మల్లికార్జునరావు, రాజశేఖర్ సహాయ కార్యదర్శులుగా చంద్రశేఖర్, లక్ష్మణ్‌లతో పాటు సభ్యులను ఎన్నుకున్నారు.

ఆదివాసీ సంప్రదాయాలను కాపాడుకోవాలి

ములకలపల్లి: ఆదివాసీల సంస్కృతీ, సాంప్రదాయాలను కాపాడుకోవాలని ఆదివాసీ సేన రాష్ట్ర నాయకుడు, న్యాయవాది ఊకే రవి పిలుపునిచ్చారు. జగన్నాథపురంలో మడివి ఇలవేల్పు దైవం అందల్ కోసల్, చాపరాలపల్లి గుట్టగూడెంలో కట్టం ఇలవేల్పు చిన్నరాము, ఈదె ఓరడు, ఈదె డోకిరిలను ఆదివారం ఆయన సందర్శించారు. ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కట్టం శ్యాంకుమార్, కట్టం ఇలవేల్పు తలపతి రాజీవ్, మడివి గద్దెల ఒడ్డెలు సోడె శ్రీను, కీసరి నాగేశ్వరరావు, కట్టం నాగేశ్వరరావు పాల్గొన్నారు.

విరాళంపై హర్షం

అశ్వాపురం: భారత సాయుధ దళాలకు మద్దతుగా సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తమ ఒక నెల వేతనాన్ని జాతీయ రక్షణ నిధికి విరాళం ఇవ్వడంపై మండల కాంగ్రెస్ పార్టీ పక్షాన అభినందనలు తెలియజేస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య అన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం పార్టీ నాయకులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. సమావేశంలో మాజీ వైస్ ఎంపీపీ బేతం రామకృష్ణ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గాదె కేశవరెడ్డి, తూము వీరరాఘవులు, నాయకులు ఆవుల రవి, భద్రారెడ్డి, బేతం బాబు, సామకూరి వెంకన్న, బారాజు సంపత్, హర్ష, శశికాంత్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు కావాలంటూ ధర్నా



దమ్మపేట: రోడ్డుపై బైఠాయించి ధర్నా చేస్తున్న నల్లివారిగూడెం గిరిజనులు

దమ్మపేట: గతంలో(బీఆర్ఎస్ హయాంలో) తమ గ్రామానికి మంజూరైన బీటీ రోడ్డు నిర్మాణమును తక్షణమే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ, మండలంలోని నల్లివారిగూడెం గ్రామానికి చెందిన గిరిజనులు ఆదివారం మూకుమ్మడిగా రోడ్డుపై బైఠాయించి, రెండు గంటల పాటు ధర్నా నిర్వహించారు. సంవత్సరాలు రోడ్డు నిర్మించకపోవడంతోపాటు, ఇందిరమ్మ కమిటీల్లోనూ తమ గ్రామానికి అన్యాయం జరిగిందని వాపోయారు. నల్లివారిగూడెం క్రాస్ రోడ్డు వద్ద ప్రధాన రహదారిపై బైఠాయించడంతో.. రోడ్డుకు ఇరువైపులా వాహనాలు అధిక సంఖ్యలో నిలిచిపోయాయి. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ధర్నాలు విరమింపజేయాలని కోరగా.. ఎమ్మెల్యే జారే స్వయంగా వచ్చి హామీ ఇచ్చేవరకు ఆందోళనను విరమింపజేసేది లేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ నాయకులు సర్ది చెప్పాలని ప్రయత్నించిన వినలేదు. దీంతో ఎస్ఐ సాయి కిషోర్ రెడ్డి, ఎమ్మెల్యే జారేతో ఫోన్లో మాట్లాడించగా.. ఈరోజు సాయంత్రం మీ గ్రామానికి వచ్చి సమస్యలకు పరిష్కార దిశగా కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇవ్వడంతో, గ్రామస్తులు ధర్నాను విరమించారు.

ప్రజాపంథా ఆధ్వర్యంలో..

దుమ్ముగూడెం: మండలంలోని చిన్నార్లగూడెం నుండి డి. కొత్తగూడెం వరకు రహదారి నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా ఆధ్వర్యంలో రోడ్డుపై ఆదివారం నిరసన తెలిపారు. గత 15 సంవత్సరాల క్రితం పోసిన రోడ్డు పాడైపోయి తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ డివిజన్ నాయకులు సాయన్న, గ్రామస్తులు తెల్లం పెద్ద ముత్తయ్య, కురసం లక్ష్మయ్య, కురసం కామరాజు, తెల్లం భద్రయ్య , తెల్లం వీరభద్రం, కురసం వీరభద్రం, గుండి నరసింహారావు, రామకృష్ణ, మంగరాజు, రమాదేవి, రమణ, కామమ్మ పాల్గొన్నారు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

జి. శ్రీనివాస్, ACM - 70754 60585 లక్ష్మయ్య, ACO - 8074270476
కొత్తగూడెం యాకూబ్ పాషా - 80083 21148 భద్రాచలం ఎన్. లక్ష్మయ్య - 80742 70476
పినపాక ఎన్. లక్ష్మయ్య - 80742 70476 ఇల్లందు బి. కిషన్ - 63052 41411
అశ్వారావుపేట ఎన్. దుర్గారాంప్రసాద్-9000327175. టోల్‌ఫ్రీ నెం.:1800 270 1083

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎన్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600

యస్.రవిబాబు - 99516 02914
ఎన్. జయరాజు - 9652868642
కె. మధు - 97059 44416